రహదారి మార్జిన్లలో ఆక్రమణలు తొలగించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : పాడేరు జిల్లా ప్రధాన కేంద్రంగా మారినప్పటి నుంచి రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రహదారి మార్జిన్లలో వ్యాపారులు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించికోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. శనివారం ఉదయం ఎస్పి అమిత్ బర్ధర్ తో కలసి పాత బస్ స్టాండ్ నుండి ఆర్టిసి బస్ స్టాండ్ వరకు గల రహదారిని పరిశీలించిన కలెక్టర్ ఆర్ అండ్ బి రహదారి నుండి జాతీయ రహదారిగా మార్పు చెందిన నేపధ్యంలో రంపచోడవరం నుంచి బొడ్డవర కూడలి వరకు వంద మీటర్ల విస్తీర్ణం జరుగుతుందని, ప్రస్తుతం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నందున తొలగించాలని ఆదేశించారు. అయితే వ్యాపారులందరికి ముందుగా అవగాహన కల్పించాలని, నోటీసులు జారీ చేయాలని సూచించారు. పలు షాపులు పరిశీలించిన కలెక్టర్ ఆయా ప్రాంతాలలో స్థలం ఆక్రమించి కట్టుకున్నవారిపై ఆగ్రహం వ్యక్త పరిచారు.

పట్టాలు ఇచ్చారు... గృహాలు మంజూరు మరిచారు : సీపీఐ

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : ఇళ్ల పట్టాలు ఇచ్చిన అధికారులు గృహాలు మంజూరు చేయడంలో ఎందుకు మరిచారని స్థానిక సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కె.సింహాచలం ప్రశ్నించారు. ఇక్కడి మండలంలోని లైగండ పంచాయితీ ఎల్.పనసపు టు గ్రామంలో ఆయన శనివారం సందర్శించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయంలో గ్రామంలో గల 15 గిరిజన కుటుంబాలకు గృహ పట్టాలు మంజూరు చేశారన్నారు. పట్టాలు మంజూరు చేసి గృహాలు మంజూరు చేయడంలో అధికారులు మరిచారని ఆయన తెలిపారు. అధికార యంత్రంగా స్పందించి ఎల్ .పనస పుట్ గ్రామ గిరిజనులకు గృహాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. అలాగే మౌలిక సౌకర్యాలు కల్పన భాగంగా ఆ గ్రామానికి డ్రైనేజీ, సిసి రోడ్లు, సామాజిక భవనం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

బూసిపాడు నుండి కరివేషు వరకు 3 కిలోమీటర్లు డోలీ మోసిన ఆదివాసులు

విశాలాంధ్ర -అనంతగిరి: పేరంగి జానిబాబు(12) స్పృహ తప్పి పడిపోయాడు. దీనితో తన కుటుంబ సభ్యులు బాబురావు, కృష్ణ సహాయంతో మూడు కిలోమీటర్లు మోసుకొచ్చి. ప్రైవేట్ ఆటోలో ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ బూసిపాడు కొండ శిఖర గ్రామం గ్రామం నుండి గుమ్మ పంచాయతీ కరివేసు గ్రామం వరకు మూడు కిలోమీటర్లు డోలుమోసుకొని కొండ దిగుతూ కరివేసు వద్ద ఆటో సహాయంతో ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు.కృష్ణాపురం నుండి బూసి పాడు గ్రామానికి ఉపాధి హామీ పథకం మెటీరియల్ గ్రాండ్ నిమిత్తం 44 లక్షల రూపాయలు నిధులుతో మంజూరు అయ్యాయి. కృష్ణాపురం మీదనే శివలింగపురం రైల్వే స్టేషన్ ఉంది. రైల్వే ట్రాక్ మీద నుండి ఎటువంటి భారీ వాహనాలు వెళ్లడానికి వీల్లేదని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈవిధంగా రోడ్డు మా గ్రామానికి రాదు. కానీ అధికారులు మాత్రం ఈ విధంగా రోడ్ నిధులు మంజూరు చేసి పనులు చేస్తున్నారు. వాస్తవానికి మా గ్రామానికి రావాలంటే గుమ్మ పంచాయతీ నుండి కరివేషు మీదుగా బూస్పాడు రోడ్డు రాడానికి వీలవుతుంది. ఈవిధంగా నిధులు పెట్టకుండా కృష్ణాపురం నుండి బూస్పాడు రోడ్డు పెట్టడం. రైల్వే స్టేషన్ వచ్చే జనాలకు ఉపయోగపడుతుంది. తప్ప మాగానికి ఎటువంటి ఉపయోగం లేదు తక్షణమే కరివేషనుండి బూస్పాడుకి రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అతిధి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రదానాచార్యురాలు విజయభారతి

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయ భారతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎమ్మెస్సీ ఫిజిక్స్ నందు 55 % తో పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. NET, SLET, Ph.Dలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో 19 తేదీన (మంగళవారం) కళాశాలలో సంప్రదించాలని, డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

ఆటో, మోటర్ వాహన డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏఐటీయూసీ నాయకులు రాజబాబు, అమర్ డిమాండ్

విశాలాంధ్ర-పాడేరు రూరల్ : ఆటో, మోటర్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో ఆటోలతో శనివారం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జల్లి రాజబాబు జిల్లా కో-కన్వీనర్ అమర్‌లు పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆటో కార్మికుల సమస్యల పరిష్కారదిశగా పెద్దఎత్తున ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించగా ఎన్నికలకు ముందు టిడిపి ప్రభుత్వం ప్రచారంలో భాగంగా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలల పైబడి గడుస్తున్నప్పటికీ ఆటో కార్మికుల కోసం కనీసం ఒక్క మాట కూడా రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఆటో, మోటర్ వాహన డ్రైవర్లకు,కార్మికులకు ప్రభుత్వం పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో, మోటర్ డ్రైవర్లకు పెనాల్టీలు పెంచేటువంటి 21, 31 జీవోలను తక్షణమే రద్దు చేస్తానని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది నేటికీ రద్దు చేయలేదన్నారు.తక్షణ మే 21, 31 జీవోలను రద్దు చేయాలన్నారు. జరిమానాలు భారీ ఎత్తున ఆటో, మోటార్ కార్మికులపై విధిస్తు న్నారని తక్షణమే జరిమానాలు తగ్గించా లన్నారు. ప్రమాదంలో చనిపోయి నటువంటి ఆటో, మోటార్ డ్రైవర్లకు 10 లక్షల రూపాయలు, అనారోగ్యంతో చనిపోయిన వారికి ఐదు లక్షల రూపాయలు కేటాయించాలన్నారు. టాటా మ్యాజిక్ వ్యాన్లకు భారీగా పెంచిన రోడ్ టాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ని 30శాతం కి ఆటో, మోటార్ రంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పెట్రోల్ ,డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్చేశారు. జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్ చేర్చాలని కోరారు.ఇంజన్ ఆయిల్, స్పేర్ పార్టులను ధరలు తగ్గించాలన్నారు. జిల్లా కేంద్రంలో ఆటోలకు జీపులకు, మోటారు వాహనాలకు నిలుపుదల చేసేందుకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. తదితర సమస్యలపై భవిష్యత్తులో ఆటో, మోటార్ కార్మికులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అన్నా మున్నా,కూడా శాంతి బాబు, ఆనంద్, గణేష్, వెంకటరమణ, వంశి, లక్ష్మణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిరోధక చట్టంపై ఒకరోజు వర్క్‌షాపు నిర్వహణ

విశాలాంధ్ర-జీమాడుగుల : మండల కేంద్రంలో శనివారం ఏ.రవిశంకర్, అదనపు డిజీపి, సి.ఐ.డి., ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాలమేరకు, షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల అత్యాచార నిరోధక చట్టంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను ఏఎస్ఆర్ జిల్లాలోని జి.మాడుగులలో జి.ప్రేమ్‌కాజల్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, రీజినల్ ఆఫీసర్, సీఐడి, విశాఖపట్నంవారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఏఎస్ఆర్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, అమిత్ బర్దర్, పాల్గొన్నారు. అతిధులుగా బి. వేణుగోపాల్, డీస్పీ, మహిళా పోలీస్ స్టేషన్, ఏఎస్ఆర్ జిల్లా, ఎల్.రజని, డిప్యూటీ డైరెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, ఐటీడీఏ పాడేరు, పి.లచ్చాపాత్రుడు, తహసీల్దార్, జి.మాడుగుల, టి.ప్రసాద్ నాయుడు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పాడేరు, వంతల నాగేశ్వరరావు, ప్రెసిడెంట్, ఆదివాసీ సంక్షేమ పరిషత్, కిల్లో రాజన్న, ప్రెసిడెంట్, ఆదివాసీ గిరిజన సంక్షేమ పరిషత్, లకే శివ సత్యనారాయణ, ఇంచార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, జి.మాడుగుల పాల్గొన్నారు. సీఐడి ఇన్స్పెక్టర్స్ జి.వి.రమణ, పీవీవీ నరసింహారావు, సీహెచ్. రుద్రశేఖర్‌లు, సీఐడి సిబ్బంది ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై షణ్ముఖరావు. జూనియర్ కాలేజ్ విద్యార్థులకు పాల్గొన్నారు. జి.మాడుగుల గ్రామస్తులకు షెడ్యూల్ తెగల అత్యాచార నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించడం జరిగింది. సదస్సు అనంతరం, విద్యార్థులకు పరీక్ష నిర్వహించి, బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.

బాలుర ఆశ్రమ పాటశాల డిప్యూటీ వార్డెన్ సస్పెండ్, హెచ్‌ఎంకు షోకాజు నోటీసు

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలో గల మెరకచింత ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాటశాల డిప్యూటీ వార్డెన్ ఎం.పి కోటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ ఉప సంచాలకులు ఎల్. రజని ఉత్తర్వులు జారీ చేసారు. అదేవిధంగా అదే పాటశాలలో ప్రదానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఎస్.శాంతకుమారికి షోకాజ్ నోటీస్ జారీ చేసారు. వివరాల్లోకి వెళ్తే 15వ తేదీ అర్ధ రాత్రి జిటిడబ్ల్యూ పాఠశాలకు చెందిన 20బస్తాల బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా బాకూరు గ్రామస్తులు పట్టుకుని సీజ్ చేయడం జరిగింది. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న ఇంచార్జ్ ఉపసంచాలకులు నేరుగా వెళ్లి విచారణ జరపగా ఆ బియ్యం మెరకచింత పాఠశాలకు చెందినవిగా గుర్తించి ప్రాథమిక విచారణ ప్రకారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సూచనల మేరకు డిప్యూటీ వార్డెన్‌ను సస్పెండ్ చేయడంతో పాటు హెచ్‌ఎంను సంజాయషీ కోరినట్లు ఎల్.రజని తెలిపారు. పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు.

భార్యాభర్తలపై కత్తితో దాడి

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలో గల తాడిపుట్టు పంచాయితీ గదుగుపల్లి గ్రామంలో శనివారం భార్యాభర్తలపై దాడి చేసిన సంఘటన తీవ్ర సంచలనం రేపింది. దీనికి సంబంధిం చిన వివరాల ప్రకారం కోడా రత్నాలమ్మ, కృష్ణ బాబు దంపతులు తమ వరి పొలం, పనులు ముగించుకుని వస్తున్న సమయంలో పశువుల కోసం ఉంచిన గడ్డిని అదే గ్రామానికి చెందిన తమర్బ చినకొండ

పడాల్ కాల్చి బూడిద చేసాడు. అయితే తమ పశువుల కోసం ఉంచిన గడ్డిని ఎందుకు దహనం చేశావని రత్నాలమ్మ, ఆమె భర్త కృష్ణబాబు అతని నిలదీశారు. అయితే మద్యం మత్తులో ఉన్న ఆయన కోపోద్రుక్తుడై తమ వద్దనున్న కత్తితో దంపతులను నరకపోయాడు ముందుగా భర్తను కత్తితో దాడి చేస్తుండగా అతని చేతికి గాయమై పరుగులు తీశాడు. వెంటనే పక్కనే ఉన్న భార్య రత్నాలమ్మను నరకపోగా తప్పించుకునె ప్రయత్నంలో ఆమె చేతికి తీవ్రమైన గాయాలై స్పృహ తప్పి కింద పడిపోయింది. దీనిని గమనించిన గ్రామస్తులు హుటాహుటిన 108 వాహనానికి సమాచారం అందించి పాడేరు జిల్లా ఆస్పత్రికి గతంలో ఇదే గ్రామంలో పలు తగాదాల కేసులో సెంటర్ జైలో శిక్షణ అనుభవించి బయటకు వచ్చిన సంఘటనలు కూడా ఉన్నాయని, ఇటువంటి వ్యక్తులు గ్రామంలో ఉంటే అందరికీ ప్రాణాపాయం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నారా రామ్మూర్తినాయుడు మరణం టీడీపీ పార్టీకి తీరని లోటు : కిదారి

విశాలాంధ్ర -పాడేరు రూరల్ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు గుండె పోటుతో మరణించడం తెలుగుదేశం పార్టీకి నారా కుటుంబానికి తీరని లోటని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని నారా వారి కుటుంబానికి మనో ధైర్యం ఇవ్వాలని భగవంతునికి ప్రార్థిస్తున్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి : ఆర్‌డిఎం రవీంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలో బకాయి పడ్డ ఆస్తి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఆర్‌డిఎంఏ) రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్లో కమిషనర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ, పారిశుద్ధ్యం, తాగునీరు విభాగాల సిబ్బందితో రివ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. మొండిబకాయలను మున్సిపల్ నిబంధనలు అనుసరించి సకాలంలో వసూలు చేయాలని, అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుల వసూలను వేగవంతం చేయాలన్నారు. ఆస్తిపన్ను వసూలలో సచివాలయ సిబ్బందితో మమేకమై రెవెన్యూ విభాగ సిబ్బంది పనిచేయాలన్నారు. అలాగే పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుకు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ప్లాస్టిక్ నిషేధానికి తరచూదాడులు నిర్వహించి ప్లాస్టిక్ ను అరికట్టాలన్నారు. పట్టణ ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా త్రాగునీటి సరఫరా విషయంలో ఇంజనీరింగ్ విభాగ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి.లక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్లు సన్యాసిరావు, అప్పారావు రెవిన్యూ అధికారి రూబేన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఈశ్వరరావు వినోద్, శానిటరీ ఇన్స్పెక్టర్ కెవిపిరాజు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

18 మూగజీవాలను వ్యాన్‌లో తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

విశాలాంధ్ర - సీతంపేట : మండల కేంద్రంలో పోలీసులు విధి నిర్వహణలో తనిఖీలు నిర్వహించగా ఒడిస్సా నౌపాడ గ్రామం నుండి 18 మూగ జీవాలు పశువులను వ్యాన్‌లో అక్రమంగా విజయనగరం జిల్లా మానాపురం తరలిస్తున్న క్రమంలో సీతంపేట సబ్ ఇన్స్పెక్టర్ అమ్మన రావు తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన వ్యక్తుల అయినా మహాత్రం ఆలీ, రిజ్విన్ ఖాన్, శంకరోజ్ ఖాన్, అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. మూగ జీవాలను కళేబరాలకు తరలించడం చట్ట ప్రకారం నేరమని, ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఉద్యోగాల పేరిట మహిళ టోకరా...!

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : మహిళ చేతిలో మహిళలే మోసపోయిన సంఘటన పట్టణంలో నెలకొంది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన ఒక మహిళ తనకు రాజకీయ పలుకుబడి ఉందని ఏ పనైనా చేయగలనని ప్రగడ్బాలు పలికి పలువురు మహిళలకు ఉద్యోగాలు ఇంటిస్థలాలు, టిట్కో ఇళ్లు, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి లక్షలాది రూపాయలు తీసుకొని, ఫోర్జరీ చేసిన ఇంటి పత్రాలు ఇచ్చి మోసం చేసినట్లు పలువురు మహిళలు వాపోతున్నారు. ఆ మహిళను నిలదీస్తే మీకు నచ్చినట్లు చేసుకోండి అని చెబుతుందని, ఆ మహిళ వలన లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నామని లబోదిబో మంటున్నారు. బాధితులు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు కూడా సమాయత్త మవుతున్నారు. ఈవిషయం పట్టణ పోలీసుల దృష్టికి తీసుకు వెళ్లగా తమ దగ్గరకు వచ్చి ఆ మహిళ గురించి బాధితులు చెప్పారని, ఆధారాలతో వస్తే కేసు నమోదు చేస్తామని చెప్పినట్లు తెలిపారు.

అర్బన్ హెల్త్ సెంటర్లకు వైద్యుల నియామకం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రాలకు ఎట్టకేలకు ప్రభుత్వం వైద్యులను నియమించింది. గత కొన్నాళ్లుగా ఈ సెంటర్లలో వైద్యులు లేకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులకు లోనయ్యారు. ఈ సెంటర్లలో వైద్యులను నియమించాలని ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు స్థానికులు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు.ఈ విషయంపై ఉన్నతాధికారులు ఎట్టకేలకు దృష్టి సారించి జగన్నాధపురంలో గల పట్టణ ఆరోగ్య కేంద్రానికి వైద్యులుగా జాగాన.పరిమళ ను,సుందర నారాయణపురం కాలనీలో హెల్త్ సెంటర్ (కొత్త బెలగాం)కు డాక్టర్ రవిచంద్రను వైద్యులుగా నియమించింది.వీరివురు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రోగులకు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో గల వైద్య సేవలను అందించడం జరుగుతుందన్నారు.

జిసిఎంఎస్ సొసైటీ ఎన్నికలకు 9 నామినేషన్లు

విశాలాంధ్ర-సీతంపేట : ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న గిరిజన సహకార సంస్థ (జిసిఎంఎస్) సొసైటీ ఎన్నికలు 2024 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం హయామాలో జిసిసి సొసైటీ ఎన్నికలు నిర్వహించడం గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికలకు శనివారం 9మంది నామినేషన్లు వేయడం జరిగిందని ఎన్నికల అధికారి జి.విజయకుమారి పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. నామినేషన్ వేసినవారు కూరంగి రామారావు, బిడ్డక కృష్ణారావు, పాలక ఆదినారాయణ, మూటక. ఎండయ్య, మూటక రత్నాలమ్మ, ఊయక. సింహాద్రి, పత్రిక శ్రీనివాసులు, పిరబోను శ్రీనివాసులు, కుండంగి బలరాం, జిసిఎంఎస్ సొసైటీ ఎన్నికలకు 9మంది నామినేషన్ వేయడం జరిగిందని తెలిపారు వై మోహన్రావు డీఎల్సివో పాలకొండ, డి.కృష్ణ జిసిసి మేనేజర్ పాల్గొన్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-సాలూరు : గోడ కూలడంతో శిథిలాల కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది.కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం బంగారమ్మ పేటకు చెందిన నల్ల శంకరి(40) రోజువారీ కూలిగా వివిధ పనులకు వెళ్తూ ఉంటాడు. అందులో భాగంగా శనివారం పట్టణంలో ప్రభుత్వ పశువుల ఆసుపత్రి సమీపంలో శిధిలావస్థలో ఉన్న పాత ఇంటి గోడను తొలగించే పనికి కాంట్రాక్టర్ పిలవగా వెళ్ళాడు. గోడను తొలగిస్తున్న సందర్భంలో ప్రమాదవశాత్తు గోడ కూలిపోయింది. గోడ క్రిందభాగంలో పనిచేస్తున్న నల్ల శంకరి తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య మరియమ్మ,కుమారులు ప్రసాద్, సంజీవ్‌లు ఉన్నారు. కూలి పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్న శంకరి మరణంతో కుటుంబాన్ని ఎలా పోషించాలని మరియమ్మ కన్నీరుమున్నీరై విలపిస్తుంది. శంకరి మరణంతో బంగారమ్మపేటలో విషాధచాయలు అలముకున్నాయి.

పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : మండల అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, వెలుగు సంఘం అధ్యక్షులకు, డిజిటల్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కే. ధర్మారావు, ఎంపీడీవో సాల్మన్‌రాజు, ఎంఈఓ చంద్రశేఖర్, ఎంపీపీ దీనమయ్య, వైస్ ఎంపీపీ శేఖర్‌బాబు, ఏపీఓ దాలయ్య, ఎంపీటీసీ రమణ, గుమ్మ లక్ష్మీపురం సర్పంచ్ బత్తాడ గౌరీ శంకర్రావు హాజరయ్యారు.

ఎల్‌టిఆర్ కేసులపై విచారణ



విశాలాంధ్ర -గుమ్మలక్ష్మీపురం/పార్వతీపురం : ఎల్ టి ఆర్ కేసులపై పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ విచారణ చేశారు. ఎల్విన్ పేట గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం మండలం దిగువమండ, కురుపాం మండలం నీలకంఠపురం గ్రామాలకు చెందిన కేసులను శనివారం విచారణ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వి.ఆర్.పేటను కలెక్టర్ సందర్శన

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మండలం వెంకట రాయుడుపేట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ శనివారం ఉదయం సందర్శించారు. జట్టు స్వచ్ఛంద సంస్థ వెంకట రాయుడు పేట గ్రామంలో గోశాల (ఎనిమల్ హాస్టల్) ఏర్పాటు చేయుటకు తద్వారా గ్రామాన్ని మోడల్ గ్రామంగా చేయుటకు నిర్ణయించింది. ఈ మేరకు గ్రామంలో పరిస్థితులు తదితర అంశాలను సంబంధిత ప్రతినిధులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. గ్రామ పంచాయతీలో గల పశు సంపదను ఉపయోగించుకొని పాలు, పాల ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేయుటకు యోచిస్తున్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో పెద్ద ఎత్తున డెయిరీ స్థాయిలో నిర్వహణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని పశుసంవర్థక శాఖ అధికారులకు ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశించడం జరిగింది. వెంకట రాయుడు పేట గ్రామంలో ఏర్పాటు చేయనున్న గోశాలకు ప్రజలు అందరూ సహకరించాలని ఆయన కోరారు. జిల్లాలో అనేక కార్యకలాపాలు చేపట్టుటకు అవకాశాలు ఉన్నాయని ప్రజలు కొంత మేరకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించడం వలన మంచి ఫలితాలు సాధించగలమని ఆయన చెప్పారు. జిల్లాలో ఈ ప్రాజెక్టు గొప్ప నాంది కాగలదని ఆయన అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా వెంకట రాయుడు పేట గ్రామంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొనాలని కోరారు. పాడి పశు సంపదను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. నీటిని పొదుపుగా వాడాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్రా సలహాదారు సి శ్రీనివాసన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, పశు వైద్య అధికారి జయ కిరణ్, జట్టు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండి పుస్తకాల పఠనం అలవర్చుకోవాలి : డిపిఆర్ఓ రమేష్

విశాలాంధ్ర-పార్వతీపురం : విద్యార్థి దశ నుండి పుస్తకాలు చదవటం అలవర్చుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఎల్ రమేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలలో ముఖ్య అతిథిగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఎల్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి గ్రంథాలయాలు ఎంతో దోహద పడతాయని, పుస్తకం చదవడం ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. పుస్తక పఠనంతో వ్యక్తిగత వికాసంతో పాటు విజ్ఞానం నైపుణ్యత పెంపొందించుకోవచ్చని అన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న సాహిత్యం, మహానుభావుల జీవిత చరిత్రలు, ఇతర పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలన్నీ ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ఒక మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడుగా ఉపయోగపడుతుందని అన్నారు. గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి.శివకేశవరావు మాట్లాడుతూ నిత్య పఠనం విజ్ఞాన దాయకమన్నారు. ప్రధాన ఉపాధ్యాయలు ప్రసాద్ మాట్లాడుతూ మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానం అన్నారు. విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు, పుస్తకాలు అందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంటిపేట- కోమటిపల్లి బిటిరోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర -సీతానగరం : మండలంలోని ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న అంటిపేటటి కోమటిపల్లి గ్రామాలమధ్య ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆదేశాలు, సూచనల మేరకు గుత్తేదారు బీటీరోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో అంటిపేట గ్రామపంచాయతీలోని అంటిపేట వెంకటాపురం బుచ్చంపేట గ్రామాలకు ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈరోడ్డుఎంతోమందికి ఉపయోగకరమని రోడ్డని వారు తెలిపారు. ఎమ్మెల్యేకు వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి స్మగ్లర్ల ఆస్తుల స్వాధీనానికి ఐదు జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్ష : డీఐజీ

విశాలాంధ్ర-పార్వతీపురం : విశాఖపట్నం రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగుకు ఆర్థికంగా మద్దతు తెలుపుతున్న వ్యాపారస్తులను, గంజాయి కేసుల్లో వివిధ రూపాల్లో కూడబెట్టిన ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి సమీక్షించి రేంజ్ రేంజ్ పోలీసు అధికారులకు తదుపరి కార్యాచరణకు ఆదేశాలు జారీ చేశారని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఐదు జిల్లాల ఇన్స్పెక్టర్లు, లీగల్ అడ్వైజర్లు ఇతర అధికారులు పాల్గొన్నారన్నారు.

గాదెలవలసలో టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గాదెలవలసగ్రామంలో టీడీపి నాయకులు బోగి. శంకరరావు ఆధ్వర్యంలో, చుక్క వేణుగోపాల్, బోగి శ్రీనివాసరావు, బోగి. జయప్రకాష్, తెలుగుదేశం కార్యకర్తలు సమక్షంలో దొడ్డి సత్యనారాయణ గత రెండురోజులుగా 150 మంది సభ్యత్వాలను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర ఆదేశాలు, సూచనల మేరకు టీడిపి సభ్యత్వ నమోదు ప్రక్రియ చురుగ్గా నిర్వహిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని అన్నిగ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు చురుగ్గా జరుగుతుందని మండల పార్టీ ప్రెసిడెంట్ సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ నాయుడులు తెలిపారు. అన్ని గ్రామాల్లో అనూహ్య స్పందన లభిస్తుందన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులే కూలీలు...!

విశాలాంధ్ర-హుకుంపేట : ఆశ్రమ పాఠశాలల్లో తన పిల్లలు చదువుకొంటారని తల్లిదండ్రులు పంపిస్తే వారిని వార్డెన్లు, ప్రధానోపాధ్యాయలు కలసి కూలీ పనివారిగా మారుస్తున్నారు. దీనిని సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో ప్రభుత్వం పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు శనివారం వారపు సంతలో వార్డెన్లు కొనుగోలు చేసిన అరటి గెలలు తమ పాఠశాలకు మోసుకుంటూ వెళ్తున్నారు. వార్డెన్లు కోనటం విద్యార్థులు మోయటం ఆశ్రమ పాఠశాల్లో చదువుకొంటారని తల్లి దండ్రులు వారి పిల్లల్ని పంపిస్తే వార్డెన్ వారిని కూలీలుగా మార్చ టం దారుణం అని అరటి గెలలు మోస్తున్న విద్యార్థులను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ర్థులు మోయలేక మోసుకుంటూ వస్తుంటే వారిని చూసిన పలువురు తల్లులు కళ్ళు చమర్చారు. వార్డెన్ పాఠశాలో వర్కర్లను కానీ బైట కూలీ పని చేసే వారికి చెప్పకుండా డబ్బులు మిగిలించుకోవాలని విద్యార్థులతో పని చేయించటం మానుకోవాలని ఎటువంటి వార్డె న్లును తక్షణమే ఉన్నత అధికారు లు చర్యలు తీసుకోవాలని పలువు రు డిమాండ్ చేశారు.

బిర్సాముండ జయంతి వేడుకలకు ఐటీడీఏ పీఓ హాజరు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జన జాతీయ గౌరవ దివస్ భాగంగా నిర్వహించిన గిరిజన యోధుడు, భగవాన్ బిర్సాముండా 150 జయంతి వేడుకలలో పాడేరు ఐటిడిఎ పిఓ అభిషేక్ పాల్గొన్నారు. ఆయన నేతృత్వంలో అరకు వ్యాలీ కొత్త భల్లు గూడ ఆదివాసి గిరిజనులు కూడా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా భారత ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆదివాసీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రూపొందించిన ఒక ఆల్బమ్ ఆదివాసీ గిరిజన బృందం నుండి స్వాభి గంగ చేతుల మీదగా ప్రధాన మంత్రికి బహూకరించారు. స్వాభి గంగ తో సుమారు అరగంట సేపు ప్రధాని ముచ్చటించారు. గిరిజన ప్రాంతంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రధాన మంత్రి అడిగి తెలుసుకున్నారు. గిరిజన కాఫీకి అంతర్జాయ గుర్తింపు లభిస్తోందని పి. ఎం. అన్నారు. ఐటిడి ఏ పి. ఓ వి. అభిషేక్ మాట్లాడుతూ పియం జన్ మన్ పథకంలో 22831 మంది పివిటిలకు ఇళ్ళు మంజారు చేసామని వివరించారు. 13973 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు, 10,200 మందికి కుల ధృవీకరణ పత్రాలు, 22,170 మందికి ఆధార్ కార్డులు,1918 మందికి పి.యం.ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందించామని 33,387 మందికి బ్యాంకు ఖాతాలు తెరిచామన్నారు.

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ కూర్మారావు

విశాలాంధ్ర-చింతపల్లి : యువత పై మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల ప్రభావం, వాటి నిర్మూలన పై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జే కూర్మారావు అన్నారు. ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పెంటపాడు ప్రాంతీయ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటిఐ) కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ మద్యం (నాటు సారా) సేవనం, వినియోగం, విక్రయం, యువతపై డ్రగ్స్ ప్రభావం, అనధికార ఎన్‌డిపిఎల్, ఐఎంఎల్ మద్యం, ఎండు గంజాయి తదితరాల నిర్మూలనకు ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ శాఖకు సహకరించా లన్నారు. అదే క్రమంలో యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వలన సమాజానికే చేటు కలుగుతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తును నాశనం చేసే వాటి జోలికి పోకుండా యువత, విద్యార్థులు సన్మార్గంలో మెలగాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆశాఖ ఎస్సై పి.అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ కే చిన్నయ్య, ఆర్ డి నాయుడు, జి శివ, ఐటిఐ అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే రహదారి మార్గంలో పెట్రోల్ బంక్ వద్దు

విశాలాంధ్ర-కొమరాడ : రైతులు పొలాలకు వెళ్లే మార్గంలో జిసిసి పెట్రోల్ బంక్ ప్రతిపాదన ఇరమించుకోవాలంటూ శనివారం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ నాయకులు కే సాంబమూర్తి రైతులు తాసిల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా కొల్లి సాంబమూర్తి రైతులు గౌరునాయుడు ప్రసాద్ మాట్లాడుతూ కొమరాడ గ్రామానికి చెందిన 45 మంది రైతులు తమ తాత ముత్తాతల నుండి తమ పొలాలకి పూర్వకాలం నుండి ఇదే రహదారి మార్గంలో తమ పండించిన పంటలను ఇంటికి తెచ్చుకునే పరిస్థితి ఉందని ఇలాంటి సందర్భంలో ఈరహదారి మార్గం మూసివేసి పెట్రోల్ బంకు నిర్వహిస్తామనడం చాలా ఇబ్బందికరమైన విషయమని అలాగే దీనికి అనుకొని చుట్టుపక్కల కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు కస్తూరిబాయ్ స్కూలు మరియు రజకుల బట్టలు ఉతికే చెరువు, మరియు హౌసింగ్ కార్యాలయం, పశువుల ఆసుపత్రి మరియు కొమరాడ పోలీస్ స్టేషన్ కలవని ఇలాంటి సందర్భంలో ఇన్ని సమస్యలు ఉన్న సందర్భంలో ఇక్కడ పెట్రోల్ బంకు నిర్మించడం తగదని కాబట్టి ఈ పెట్రోల్ బంకు వేరే దగ్గరికి తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకుని మాకు పూర్వకాలము నుండి ఉన్న రహదారిని మూసి వేయకుండా మాకు అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతులు ఇంచార్జ్ తాసిల్దార్ శివయ్య కి వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో రైతులు ప్రసాదు కృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ బెడదతో అత్యవసర సేవలకూ విఘాతం

విశాలాంధ్ర హుకుంపేట : మండల కేంద్రంలోని నిత్యం ట్రాఫిక్ బెడదతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవలకు ట్రాఫిక్‌వల్ల విఘాతం కలిగిస్తుంది. అంబులెన్స్‌కు కూడా దారి దొరకని పరిస్థితి ఏర్పడింది. శనివారం వారపు సంత కావడంతో మరింత ట్రాఫిక్‌తో కిక్కిరించిన జనాలతో మండల కేంద్రం కనిపిస్తుంది. మండలంలోని రోడ్డు విస్తీర్ణం లేక ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హుకుంపేట మెయిన్ రోడ్‌లో రోడ్డు విస్తీర్ణ లేక రోడ్డులో ఆనుకొని షాపులు ఉండడంతో నిత్యం ట్రాఫిక్‌తో మండల కేంద్రం నిండిపోతుంది. రోడ్డు విస్తరణ చేసి ట్రాఫిక్ అంతరం లేకుండా చూడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు. గతంలో రోడ్డు విస్తీర్ణ కోసం రెండువైపులా రెవిన్యూ అధికారులు కోల్చినప్పటికీ వాటిపై జిల్లా అధికారులకు తెలియజేయకుండా వాటిని రహస్యంగా ఉంచినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. రోడ్డుపక్కన ఉన్న ఆర్‌ఎండ్‌బి స్థలాలు సైతం అక్రమంగా దుక్కణాలు నిర్మాణం చేపడుతున్న రెవెన్యూ అధికారులు వాటిని తొలగించకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యతో ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా అత్యవసర చీరలకు ఉగాతం లేకుండా చూడాలని మండల వసూలు కోరుతున్నారు.

మండల అభివృద్ధికి ప్రణాళిక అవసరం ఎంపీపీ శెట్టి శ్యామల

విశాలాంధ్ర-కొమరాడ : మండలం అభివృద్ధి పదంలో నడవాలంటే ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయి అవగాహన అవసరం ఉండాలని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ

ఇరవై ఐదు 26వ సంవత్సరానికి గాను మండలాభి వృద్ధి ప్రణాళిక, గ్రామాభివృద్ధి ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణా మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమానికి నిర్వహించారు ముఖ్యఅతిథిగా గౌరవ జడ్పిటిసి సభ్యురాలు ద్వారపురెడ్డి లక్ష్మి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 31 పంచాయతీలు అభివృద్ధి పథంలో నడవాలంటే ముందుగా గ్రామ సర్పంచులకు ఎంపిటిసి సభ్యులకు ముందస్తు శిక్షణ ఇవ్వటం మంచి పరిమాణం గ్రామాల్లో అభివృద్ధి పనులు గుర్తించుకోవడానికి మంచి అవకాశం అనే ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం మల్లికార్జునరావు సర్పంచులు సుంకర సుగుణ గాజుల శ్రీనివాసరావు దత్తి మురళి సిరికి గంగమ్మ ఎంపీటీసీ సభ్యులు దేవకోటి వెంకట నాయుడు మండల విస్తరణ అధికారి మద్రాపు రాధాకృష్ణ టివోటిలు భీమయ్య పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యులు అగ్రహం

- సమయానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ పట్టుబట్టిన సభ్యులు
- కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని ఎంపీడీవో హామీ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండల సర్వసభ్య సమావేశానికి సమయపాలన పాటించని గైర్హాజర్ అధికారులపై స్థానిక మండల ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ బాక. ఈశ్వరి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు హాజరు కావలసి ఉండగా కొన్ని శాఖ అధికారులు ఆలస్యంగా 12 గంటల తర్వాత హాజరయ్యారు. అది కూడా మండల స్థాయి అధికారులు హాజరు కాకుండా అసిస్టెంట్లను సమావేశానికి పంపించడంతో సభ్యులు తప్పు పట్టారు. ప్రతి సమావేశానికి నిత్యం ఇలాగే జరుగుతుందని ఇప్పటికైనా మార్చుకోవాలని ఎంపీపీ జడ్పిటిసి తోపాటు వైసీపీలు ఎంపీటీసీలు సర్పంచులు మూకుమ్మడిగా అధికారుల తీరుపై మండిపడి తక్షణమే సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటారా.. లేదా.. స్పష్టమైన సమాధానం చెప్పాలంటూ ఎంపీడీవో ప్రేమ్ సాగర్ ను పట్టుబట్టి నిలదీశారు. దీంతో స్పందించిన ఎంపీడీవో ఎవరైతే ఎటువంటి సమాచారం లేకుండా సమావేశానికి గైరాజర్ అయినా అధికారులపై చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టర్కు నివేదిక పంపిస్తానని హామీలు ఇవ్వడంతో సభ్యులు సమావేశాన్ని కొనసా గించారు. సమావేశంలో అభివృద్ధి సంక్షేమ సమ స్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయి. వాటిని ముందుగా అధికారులు చెప్పిన తర్వాత మిగిలిన చర్చ జరపాలని సభ్యులు నిలదీశారు. మండలం లోని పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా విధులు చేపడుతున్నారని అటు వంటి వారిపై చర్యలు తీసుకోవాలని కంద్రుమ్, గసభ, కితలంకి పంచాయతీ సర్పంచ్‌లు కే హరి పి సునీత సుబ్బారావులు దృష్టికి తీసుకెళ్లారు. జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ పంచాయతీ సర్పంచ్ పి.కొమ్ములతోపాటు పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో భోజన సాలలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు భోజన సమయం లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆదివాసి విద్యార్థులు అంటే అంత చులకనగా ఉందా... అంటూ సభ్యులు ముక్కు మడిగా అధికారులకు నిరదీశారు. పంచాయతీ పరిధి గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరిగిన ప్రోటోకాల్ పాటించి పంచాయతీ సర్పంచ్ ఎంపీటీసీలు వార్డు సభ్యులకు ఆహ్వానించకుండా వేరే వారితో అభివృద్ధి పనులు ప్రారంభించడం సరికాదని ఇప్పటినుంచి అయినా ప్రోటోకాల్ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలు నిలదీశారు. అంగన్వాడి కేంద్రాలు కూడా సమయపాలన పాటించి నిర్వహణ కొనసాగించే విధంగా చర్యలు తీసుకొని గుడ్లుతోపాటు ఇతర పౌష్టికాహార సరుకులు వచ్చినప్పుడు స్థానిక వార్డు సభ్యులు కానీ సర్పంచ్లకు కానీ ఎంపీటీసీలకు సమాచారం అందిస్తే వాటి నాణ్యతపై పరిశీలించడానికి అవకాశం ఉంటుందని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ అందుబాటు లో ఉండే విధంగా చూడాలని ఎంపీడీవోను సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, పి.లలిత ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

శరభవరంలో టిడిపి కార్తీక వన మహోత్సవం

విశాలాంధ్ర-దేవీపట్నం : మండలంలోని శరభవరం గ్రామంలో టిడిపి పార్టీ నాయకురాలు తుర్రం కుమారి ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా శనివారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు భగవాన్ శర్మ ఆధ్వర్యంలో వన పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొనగా మండల టిడిపి చెందిన పలువురు నాయకులతో పాటు సమీప ఉప్పయ్యపాలెం రామన్నపాలెం శరభవరం ప్రజలు అన్న సమారాధనలో పాలుపొంపులు పొందారు.

సిపిఎం పట్టణ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణ సిపిఎం నూతన కమిటి ఎన్నిక శనివారం నిర్వహించారు. ఈ కమిటీలో పట్టణ కార్యదర్శిగా గొర్లి. వెంకటరమణ, సభ్యులుగా పాకల సన్యాసి రావు, రెడ్డి శ్రీదేవి, సంచాన ఉమా మహేశ్వర రావు, పడాల రాజశేఖర్ బొత్స లక్ష్మి మంత్రపూడి వెంకటరమణ, కె.భగత్ ఎన్నికవ్వగా బంకురు సూరిబాబు గౌరవ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు సమస్య పరిష్కారానికి, పారిశుధ్య నిర్వహణ మెరుగు పరచడం కోసం, స్మశాన వాటికల సమస్యలపైన, టిట్కో ఇండ్ల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయడం జరుగు తుందన్నారు. అమ్మఒడి, చేయూత, రోడ్లు, కాలువలు, పైపులైన్లు వంటి ప్రధాన సమస్యలు పరిష్కారం కోసం పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు.

ఏకాగ్రతతో పుస్తక పఠనం చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ప్రతి విద్యార్థి, నిరుద్యోగి ఏకాగ్రతతో పుస్తక పఠనం చేపడితే సాధించలేనిదేమీ లేదని స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు అన్నారు. శనివారం కళాశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారి ఖాళీ సమయాలను బట్టి గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేపట్టి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అలాగే గ్రంథాలయాలలో కళాశాలలో ఉన్న పుస్తకాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సిబ్బంది గ్రంథాలయ పాఠకలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో స్థానిక ప్రభుత్వం కళాశాల విద్యార్థులు బాలికల పాఠశాల విద్యార్థినిలు సుమారు 40 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎస్. సునీత మాట్లాడుతూ గ్రంథాలయ పుస్తకాలు అభ్యసించడంవల్ల విజ్ఞానం పెరుగు తుందని చెప్పారు. హైస్కూల్ ఉత్తీర్ణత అయిన తర్వాత ఆ పైన ఇంటర్మీడియట్‌తో పాటు ఉన్నత చదువులు చదవడానికి కావలసిన పుస్తకాలు అందుబాటు లో ఉన్నాయని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడతాయి అన్నారు. ఈకార్యక్రమంలో ఓఎస్ సుబ్బారావు, ఉద్యోగుల విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డ ఊటనీరుతో రోగాల బారిన పడుతున్నాం

కుమ్మరవలస గిరిజన ప్రజల ఆవేదన

విశాలాంధ్ర-పాచిపెంట : రెండు నెలలకు పైగా తాగునీటి సమస్య పరిష్కారం చేయకపోవడం వలన గెడ్డ ఊట చలమనీరు కలుషితనీరు త్రాగి రోగాలు మారిన పడుతున్న కుమ్మరివలస గిరిజన గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కేసలి పంచాయితీ నిర్వాసిత గిరిజన గ్రామమైన కుమ్మరవలస గ్రామానికి గిరిజనులకు రెండు నెలలకు పైగా మోటారు పాడైపోయిందని అప్పటినుంచి ఎంపీడీవోకి ఇతర ఉన్నతాధికారులకు తెలియజేసిన వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోలేదని స్థానిక నాయకులు అప్పటినుంచి ఎంపీడీవోకి ఇతర ఉన్నతాధికారులకు తెలియజేసిన వినతిపత్రాలు ఇచ్చిన పట్టించుకోలేదని స్థానిక గిరిజన సంఘం నాయకులు దిసరి వసంతరావు స్థానిక మహిళలు కోడికాల బీమాలు నారాయణమ్మ బుచ్చమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గత నెల గ్రామం మొత్తం గిరిజనులందరూ జ్వరాలు బారిన పడ్డారని పాచిపెంట ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యాధికారులు రక్తపరీక్షలు నిర్వహించి వైద్యం అందించారని ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు స్పందించి త్రాగునీటి సమస్య పరిష్కారం చేయడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల క్రిందట ఎండిఓకి వాటర్ సమస్య వలన బోరు బాగు చేయండి మోటార్ బాగు చేయండి అని వినతిపత్రం ఇస్తే నేటికీ కూడా ఆ గ్రామానికి వెళ్లకుండా అగ్రామ గిరిజనులు పట్టించుకోకుండా వ్యవహరించడం నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన ఆ గ్రామంలో బోరు ఒకటి తీయాలని అలాగే పాడైపోయిన మోటర్ను బాగు చేసి ట్యాంకు ద్వారా నీరు అందించి గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కిలో మీటర్ పైగా గెడ్డ వాగు నుంచి పెద్ద పెద్ద ఒడ్డులు ఎక్కి త్రాగునీటి కోసం కలుషితమైన చలం గెడ్డ ఊట నీరు తాగి అనారోగ్యాలు. పాలు అవుతున్న అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన పాడైపోయిన బోరును బాగుచేసి ట్యాంకుల ద్వారా నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక నాయకులు దీసరి వసంతరావు మాట్లాడుతూ త్రాగునీటి సమస్య పరిష్కారం చేయకపోతే మా గ్రామం నుంచి పాదయాత్రగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభివృద్ధే ధ్యేయంగా ఇస్కో సంస్థ

విశాలాంధ్ర-పాచిపెంట : మహిళా అభివృద్ధి ధ్యేయంగా ఇస్కో స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలో గల మూలవలస పెద్దవలస ఈతమానవలస గిరిజన గ్రామాలలో ఇసుక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ఈస్కో స్వచ్ఛంద సేవా సంస్థ అహర్నిశల కృషి చేస్తుందన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కొన్ని ప్రాజెక్టులను నెలకొల్పనున్నట్లు తెలిపారు ప్రతి ఒక్క పేద బడుగు బలహీన వర్గాల మహిళలు అభ్యున్నతి కోసం సంస్థ పనిచేస్తుందన్నారు. తక్కువదరలకే నిత్యవసర వస్తువులు అందించి ఆదుకుంటుందని అన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ఇస్కో సంస్థ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బడుగు బలహీనవర్గాల మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ఈసంస్థ పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం పోల్ నయుదు డివియం దినేష్ మండల ఎగ్జిక్యూటివ్ జగదీష్ పాల్గొన్నారు.

బంటువానివలస గ్రామాన్ని ఆరోగ్యశాఖ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సందర్శన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మండలం బందలుప్పి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని అడ్డాపుశీల పంచాయతీ బంటువానివలస గ్రామాన్ని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ ఎం.నారాయణ శనివారం సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని పరిశీలించి టీకా కార్డులు తనిఖీ చేసి, సకాలంలో పిల్లలకు టీకాలు వేస్తున్నారా లేదా అని తేదీలను పరిశీలించారు. వ్యాక్సిన్ వివిఎం పరిశీలించారు. పిల్లల్లో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల ప్రభావం ఏమైనా ఉందా, శానిటేషన్ తీరు, స్ప్రేయింగ్ నిర్వహణ తదితర వాటి వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఆర్సిహెచ్, ఎంసిపి రికార్డుల్లో గర్భిణీలు, పిల్లల టీకాల గడువు తేదీలను, టీకాలు వేస్తున్న తేదీలతో సరిచూసారు. అనంతరం అక్కడ ప్రజలతో డాక్టర్ నారాయణ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో గానీ, ప్రస్తుతంగానీ ఎవరైనా సీజనల్ వ్యాధులకు గురయ్యారా అని అడిగారు. త్రాగడానికి వినియోగిస్తున్న నీరు గురించి తెలుసుకొని ఎప్పటికప్పుడు నీటి స్వచ్ఛత పరీక్షలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పలురకాల వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రైడే అందరూ పాటించాలన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం ఎ. శాంతికుమారి, ఎం.ఎల్.హెచ్.పి శ్రావణి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రహదారుల నిర్మాణంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

జడ్పిటిసి సభ్యుడు బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : సిమెంటు రహదారుల నిర్మాణం తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జెడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్‌తో కలసి శనివారం లోతుగెడ్డ జంక్షన్ గ్రామంలో సిమెంటు రహదారి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోని గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామంలో మిగిలిఉన్న అన్నివీధులకు సిమెంటు రహదారులు మంజూరు చేయించేందుకు అరకు ఎం.పీ, పాడేరు ఎంఎల్ఏ, చింతపల్లి ఎంపిపిల సహకారంతో కలసి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ క్రమంలో గ్రామంలో నిర్మాణం చేస్తున్న ఈశ్వరమ్మ ఆలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఉల్లి లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపిపి బూసరి కృష్ణారావు, గ్రామ పెద్దలు రామకృష్ణ, రమణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండి పుస్తకాలు పఠనం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-బెలగాం : విద్యార్థి దశ నుండి పుస్తకాలు చదవటం అలవర్చుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఎల్. రమేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలలో ముఖ్య అతిథిగా రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి గ్రంథాలయాలు ఎంతో దోహద పడతాయని, పుస్తకం చదవడం ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. పుస్తక పఠనంతో వ్యక్తిగత వికాసంతో పాటు విజ్ఞానం నైపుణ్యత పెంపొందించుకోవచ్చని అన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న సాహిత్యం, మహానుభావుల జీవిత చరిత్రలు, ఇతర పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలన్నీ ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతివిద్యార్థి తన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ఒక మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడు గా ఉపయోగపడుతుందని అన్నారు. గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి. శివ కేశవరావు మాట్లాడుతూ నిత్య పఠనం విజ్ఞాన దాయకం అన్నారు. ప్రధాన ఉపాధ్యాయలు ప్రసాద్ మాట్లాడుతూ మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానం అన్నారు. విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు, పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురమంద ఆలయంలో దీపాలంకరణ

విశాలాంధ్ర-వై.రామవరం : కార్తీక పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని వై.రామవరం మండలం యార్లగడ్డ పంచాయితీ అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా వెలసిన గుర మంద శ్రీవిశాలాక్షి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆలయంలో దీపాలు అలంకరించి దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లాల వెంకటరమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో వనభోజనాలు

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం పి.ఎర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శనివారం వనసమారాదన నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థినులు వన సమారాదనను సందడిగా జరుపుకున్నారు. విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. తహసీల్దార్ వేణుగోపాల్, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిపిడిపి శిక్షణ కార్యక్రమాల ద్వారా అవగాహన పెంచుకోండి

విశాలాంధ్ర-బలిజిపేట : గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం జిపిడిపి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ నాగమణి, జడ్పిటిసి అలజంగి రవికుమార్ తెలిపారు. శనివారం జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ జడ్పిటిసిలు మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాల వలన అన్ని అంశాలు సర్పంచులకు ఎంపిటిసి లకు తెలిసిందన్నారు. గ్రామపంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పన కోసం వీటిని సద్వినియోగం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశం వివరించారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అవగాహన కల్పించడానికి ఈరోజు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మూడు రోజులపాటు మండలంలోని అన్ని శాఖల అధికారులకు ప్రజాప్రతినిధులకు గ్రామైఖ్య సంఘ సభ్యులకు శిక్షణలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈటిపి ఆర్డి, రిసోర్స్ పర్సన్,గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, సెక్రెటరీలు పాల్గొన్నారు.

నేడు సారవాణిపాలెంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో గల కాశీపట్నం పంచాయతీ సార్వానిపాలెం గ్రామంలో మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కరకవలస నగేష్ తెలిపారు ఈ వైద్య శిబిరంలో కంటికి సంబంధించిన పరీక్షలు సైతం నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెదబొండపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-పార్వతీపురం : మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు తెలిపారు.పెదబొండపల్లి రైతు సేవా కేంద్రంలో ప్రారంభించామని ఆయన చెప్పారు. జిల్లాలో మొత్తం 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ183 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఒక్కొక్క కేంద్రానికి ముగ్గురు చొప్పున నియమించిన తాత్కాలిక సిబ్బందికి కంప్యూటరీకరణ, ట్రాక్ షీట్లు, మిల్లులకు తరలింపు మరియు తేమ శాతం తెలుసుకోవడంపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. బ్యాంక్ గ్యారంటీల విషయమై జిల్లాలో అందరు మిల్లర్లకు ఇప్పటి వరకు అదేశములు జారీ చేశామని చెప్పారు. అందరు మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చుటకు సిద్ధం చేసుకుంటున్నారని, కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు వారికి నచ్చిన మిల్లులకు దాన్యం తరలించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. తొందరపడి దళారులు, మధ్యవర్తులు అయిన ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రములు విషయంమై ఏమైనా పిర్యాదులు ఉంటే కలెక్టర్ వారి కార్యాలయంలోను, జిల్లా సివిల్ సప్లయస్ మేనేజర్ కార్యాలయంలోను కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

సంకల్పం కార్యక్రమంలో భాగస్వాములు కండి : సిఐ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ మహారాజు అధ్యక్షతన మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సంకల్పం అనే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని చినమెరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతి రావు తెలిపారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దీనివలన వచ్చే ప్రభావాల వలన మనిషి ఆరోగ్య పరిస్థితులు చిన్నాభిన్నంగా ఉంటాయని దీనిని ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చినమేరంగి ఎస్ఐ పి.అనిస్ కళాశాల లెక్చరర్లు గౌరీశంకర్, కల్పన, విద్యార్థిని విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల కడుపు కొడుతున్న హాస్టల్ వార్డెన్లు

- గిరిజన విద్యార్థుల ఆహారాన్ని కూడా దొంగలించి పబ్బం గడుపుకుంటున్న అధికారులు
- గిరిజన విద్యాశాఖ పర్యవేక్షణ లోపం

విశాలాంధ్ర-పాడేరు : గత కొంతకాలంగా ఏజెన్సీ ప్రాంతంలో అనేక విద్యార్థి, విద్యార్థినులు వసతి గృహాల్లో (హాస్టల్స్) అనేక సంఘటనలు వెలుగు చూస్తున్నప్పటికీ విద్యార్థిని, విద్యార్థులకు సరైన ఆహారం కల్పించట్లేదని ప్రజా సంఘాలు గ్రామ ప్రజలు గొంతెత్తి గోశిస్తున్న ఒక్క అధికారిలో కూడా చలనం కనపడట్లేదు. దానికి నిదర్శనం శనివారం పట్టుకున్న బాకురు పరిధిలోని మెరక చింత బాలుర వసతి గృహనికి చెందిన బియ్యాన్ని హాస్టల్ వార్డెన్ రెండు ఆటోల్లో బియ్యం తరలిస్తూ దొరికిపోయిన పరిస్థితి నెలకొంది. ఒక ఆటో వదిలివేగా రెండో ఆటోలో సుమారుగా 20 బస్తాలు అనగా 1000 కేజీలు బియ్యం అక్రమంగా తరలిస్తూ ఐటీడీఏ ఇంచార్జ్ డిడి అయినటువంటి రజినికి దొరకడం పట్ల ప్రజల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క హాస్టల్లోనే ఒకేసారి సుమారు 1000 కేజీలకు పైబడి బియ్యం అక్రమ రవాణా అయితే ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్నటువంటి హాస్టల్స్ లో ఎంత బియ్యం తరలిపోతుందో దీని ద్వారా నిరూపితం అవుతుంది. అంతేకాకుండా అర్హత లేనటువంటి వ్యక్తులకు హాస్టల్ వార్డెన్ గా నియమించడం వలన వారి స్వలాభం చూసుకొని గిరిజన అమాయకపు విద్యార్థులకు పెట్టవలసిన బియ్యాన్ని కేవలం వారి అక్రమార్జన కోసం విద్యార్థులను పస్తులు ఉంచుతూ దాన్ని బయట అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై పర్యవేక్షించాల్సిన మండల ఏ టి డబ్ల్యూ ఓ లు సైతం విధి నిర్వహణలో అలసత్వం చూపిస్తూ వారి విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడం వలన హాస్టల్ వార్డెన్లు, హాస్టల్ హెచ్ఎంలు వారి ఇష్టారాజ్యంగా విద్యార్థులకు అందవలసిన ఆహారాన్ని బయట మార్కెట్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా బాత్రూములు ఫోటోలు తీయడం పై పెట్టిన శ్రద్ధ విద్యార్థులకు అందించవలసిన ఆహారం విషయంలో మాత్రంపట్టించుకోకపోవడం వలన ఫుడ్ పాయిజన్లు జరిగి ఎంతోమంది గిరిజన విద్యార్థులు మరణిస్తున్నారు. వారికి సక్రమంగా మెనూ అమలవుతుందో లేదో చూడడం గాని హాస్టల్స్ లో ఎంత స్టాకు ఉంటుందో రిపోర్టులు తీసుకోవడంలో కానీ ఏజెన్సీ ప్రాంతంలోని విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని ప్రజలు అంటున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా అస్సలు సమస్యపై అవగాహన లేనట్టు మాట్లాడడం విడ్డూరంగా ఉంది. రెండు ఆటోల్లో బియ్యం తరలిస్తుంటే ఒక ఆటోని పట్టుకుని మిగతా ఆటోలో బియ్యం ఉందో లేదో మాకు తెలియదు అని సమాధానం చెబుతున్నారు. అదే సందర్భంలో స్టార్ట్ చెక్ చేసామని చెప్తున్న అధికారులు ఎంత స్టాకు ఉంది ఎంత వాడారు మిగిలిన స్టాక్ ఎంత మిస్సైంది అని చెప్పలేని పరిస్థితి అధికారుల్లో నేడు నెలకొంది. దీన్ని బట్టి చూస్తే పై అధికారులు కూడా దొంగతనం చేసినటువంటి వార్డెన్ నీ కాపాడడానికి ప్రయత్నిస్తున్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై శాఖాపరమైన విచారణ చేస్తామని తప్ప ఇంత బహిరంగంగా బియ్యాన్ని పంపిస్తున్న వార్డెన్ ని పోలీసులకు అప్పచెప్పకపోవడం అతడిపై క్రిమినల్ చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే దీనిలో పై అధికారుల హస్తం కూడా ఉందనిపిస్తుంది. ఒక్క హాస్టల్లోనే 1000 కేజీల పైబడి బియ్యం అక్రమంగా రవాణా అవుతుంటే గిరిజన ప్రాంతంలో సుమారుగా రెండు వందల పైబడి హాస్టల్స్ ఎంత బియ్యాన్ని పిల్లలకు అందకుండా వీళ్ళు తినేస్తున్నారో అవగతం అవుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో దీనిపై స్పందించి శాఖా పరమైన చర్యలు తీసుకుని హాస్టల్స్ లో జరుగుతున్న అక్రమాల నిగ్గు తేల్చేందుకు ఒక బలమైన విజిలెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యార్థుల ఆహార విషయంలో కూడా అజాగ్రత్త ప్రదర్శిస్తూ అక్రమార్జన కు అలవాటుపడ్డ వార్డెన్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అలాగే వారిని పూర్తిగా ఉద్యోగాల నుంచి తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని గిరిజన సంఘాలు, విద్యార్థిని విద్యార్థులు తల్లితండ్రులు ముక్తకంఠంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన సలహా మండలి తీర్మానం చేయుటకు సహాయ, సహకారాలు అందించండి

విశాలాంధ్ర-సీలేరు : షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగాలు స్థానిక గిరిజనలతో భర్తీ చేయుటకు గిరిజన సలహా మండలి(టిఎసి) తీర్మానాన్ని చేయుటకు తగిన సహాయ సహకారాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు శుక్రవారం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన స్పందనలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడకు వినతిపత్రం అందించి ముఖ్యమంత్రికి పంపించాలని కోరారు. 5వ షెడ్యూల్ ప్రాంతం, ఆర్టికల్ 244(1) పేరా 5(1)లో మార్పులు చేర్పులు చేసి, షెడ్యూల్ ఏరియాలో ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగాలు స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయుటకు గిరిజన సలహా మండలి (టిఎసి) తీర్మానాన్ని చేయుటకు తగిన సహాయ సహకారాలు చేయమని, 5వ షెడ్యూల్ ప్రాంతంలో నివసిస్తున్న అన్నిరంగాలలో బాగా వెనుకబడిన ఆదివాసి ప్రజలను అభివృద్ధి పదంలో తీసుకురావటం కొరకు ఏజెన్సీ ప్రాంతంలో ఐటిడిఏ ఏర్పాటు, గురుకుల పాఠశాలలు, కళాశాల ఏర్పాటు, బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఏర్పాటు, స్థానిక గిరిజన అభ్యర్థులతో లోకల్ క్యాడర్ పోస్టులు భర్తీ కొరకు 29 జిఓలు వివిధ ప్రభుత్వ 25 శాఖలకు సంబంధించి ఇచ్చి ఉన్నారని, 1986 నుండి 2000 సంవత్సరం వరకు స్వర్గీయ ఎన్టీరామారావు,నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిల కాలంలో జరిగి ఉన్నాయని, స్వర్గీయ ఎన్టీరామారావు జిఓ 275ని 1986 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు జిఓ 3 ముఖ్యమంత్రిలుగా ఉన్న సమయంలో ఇచ్చి ఉన్నారని, ఈ జిఓల ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న లోకల్ క్యాడర్ ఉపాధ్యాయ ఉద్యోగాలు స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేసినారు. గౌరవ సుప్రీంకోర్టు వారు ఆర్టికల్ 244(1) పేరా 5 (1) ప్రకారం రాజ్యాంగంలో ఉన్న అధికారం చట్టాలలో మార్పులు చేర్పులు చేసుకొని షెడ్యూల్ ఏరియా ప్రాంతానికి నోటిఫికేషన్ ద్వారా వర్తింప చేయవచ్చు కానీ జిఓ నెం 3 రూల్స్ లో మార్పు చేసినందున ఈ జిఓను సుప్రీంకోర్టు కొట్టి వేయడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 244 పార్ట్ శాతం షెడ్యూల్డ్, ట్రైబల్ ఏరియాస్ ఆర్టికల్ 244(1), 5వ షెడ్యూల్ ప్రాంతాలు, షెడ్యూల్డ్ తెగల పరిశీలన నియంత్రణకు సంబంధించిన నిబంధనలు ఈ షెడ్యూల్ ప్రాంతముకు సంబంధించి ఈ ప్రాంత గిరిజనల సంక్షేమం, అభివృద్ధి కొరకు గిరిజన సలహా మండలి ద్వారా తీర్మానాలు చేస్తారన్నారు. పేరా 5(1) అనుసరించి పార్లమెంట్ చట్టాలను కానీ, రాష్ట్ర శాసన సభ చట్టాలను కానీ తగిన మార్పులు చేర్పులతో గవర్నర్ ఈ ప్రాంతానికి నోటిఫికేషన్ ద్వారా వర్తింపచేస్తారన్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ నిమిత్తం గవర్నర్ నిర్ణయం తీసుకొనుటకు గిరిజన సలహా మండలి తీర్మానం కొరకు ఫైల్ పంపియున్నారన్నారు. ఈ విషయం గిలిజన సలహా మండలి వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఏపీ రెగ్యూలేషన్ ఆఫ్ రిజర్వేషన్, అపాయిమెంట్ పబ్లిక్ సర్వీసెస్ యాక్ట్ 1997నకు ఆర్టికల్ 244(1) ప్రకారం తగిన మార్పులు చేర్పులు చేసి లోకల్ క్యాడర్ పోస్టులను స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ, షెడ్యూల్ ఏరియాలోగల గ్రూప్ టూ పోస్టులలో 50 శాతం పోస్టులు స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ, షెడ్యూల్ ఏరియాలో గల గ్రూప్ వన్ పోస్టులో 30 శాతం పోస్టులు స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయుటకు పేరా 5(1) అనుసరించి చట్టంలో మార్పులు, చేర్పులు చేయుటకు గిరిజన సలహా మండలి తీర్మానం చేయుట కొరకు మరియు గవర్నర్ గారు నోటిఫికేషన్ కొరకు ముఖ్యమంత్రి సహకరించాలని కోరారు. 5 వ షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగాలు మరియు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ గురించి నేషనల్ పాలసీ ఆన్ ట్రైబల్స్ 1952 ఉందని, పేరా 5(1) అనుసరించి పై చట్టంలో షెడ్యూల్ ప్రాంతం కొరకు మార్పులు చేర్పులు చేయుటకు ఈ పాలసీని కూడా పరిగణంలోకి తీసుకోవాలని కోరారు. కనుక పేరా 5(1) అనుసరించి చట్టంలో మార్పులు చేర్పులు చేయుటకు గిరిజన సలహా మండలి తీర్మానం, గవర్నర్ నోటిఫికేషన్ లో చేసినట్లయితే ఈ ప్రక్రియ రాజ్యాంగ బద్దంగా ఉంటుందన్నారు. కనుక ఎటువంటి చట్టబద్ధమైన వివాదాలు తలెత్తే అవకాశం ఉండదు. కనుక పేరా 5(1) అనుసరించి చట్టంలో మార్పులు చేర్పులు చేయుటకు తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, అప్పటి, నేటి ముఖ్యమంత్రి అయిన మీరు షెడ్యూల్ ప్రాంత ఆదివాసీల అభివఅద్ధి కాంక్ష, లక్ష్యము నెరవేరుట కొరకు పేరా 5(1) ఎక్సెప్షన్ మరియు మోడిఫికేషన్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడపా విష్ణుమూర్తి, కొర్ర తిరుపతి, జర్తా రాజారావు, చిక్కుడు అశోక్, రాజుబాబు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలలో ప్రజాగళ వినిపించనివారికి పదవులు ఎందుకు?

తెదేపా మండల ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : చట్ట సభలలో గళం వినిపించని ప్రజా ప్రతినిధులు ప్రజలు కల్పించిన పదవులకు రాజీనామా చేయాలని తెదేపా మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటే చట్టసభలలో ప్రజా సమస్యలను లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేయవలసిన ప్రజా ప్రతినిధులు అందుకు భిన్నంగా చట్టసభలకు వెళ్లకుండా ప్రజాక్షేత్రంలోనే పోరాడుతామని, చట్ట సభలకు వెళ్లకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గిరిజనులకు జీవనాడి వంటి జీవో నెంబర్ 3 రద్దు వలన గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, దాని పునరుద్ధరణకు పార్లమెంట్‌లో ఎంపీలు, శాసనసభలో ఎమ్మెల్యేలు తమ గళన్ని వినిపించా లన్నారు. నేడు వైకాపా ఎమ్మెల్యేలు అందుకు విరుద్ధంగా శాసనసభకు వెళ్లకుండా ప్రజాసమస్యలపై ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తామని ప్రకటించడం అర్థరహితమన్నారు. ప్రజలు ఎన్ని ఉద్యమాలు చేసినా చట్టసభల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ఉద్దేశంతోనే ప్రజా ప్రతినిధులుగా ఎంపీలు ఎమ్మెల్యేలను చట్టసభలకు ఎన్నుకున్నామన్నారు. చట్టసభలకు వెళ్ళని ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో పోరాడాలి తప్ప ప్రజలు కల్పించిన పదవులను అనుభవిస్తూ ఆ పదవుల లక్ష్యానికి తూట్లు పొడిచే విధంగా ఆలోచన చేయడం మంచిది కాదన్నారు. గిరిజన ప్రజాప్రతినిధులుగా ఉండి గిరిజనులుఎదుర్కొంటున్న సమస్యలపై చట్టసభలలో ప్రశ్నించకపోవడం వలననే స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు కావస్తున్నా మన్య ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇటువంటి ప్రజాప్రతినిధుల నిర్వాకం వలన గిరిజనులుగా తమకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులు నిర్వీర్యం అయిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజన ప్రాంత ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్లమెంటు, శాసనసభల సమావేశాలకు హాజరై గిరిజనుల గలాన్ని తమ గళంగా వినిపించాలని గిరిజన ప్రజా ప్రతినిధులకు ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పొత్తూరు రామ్మూర్తి, వార్డు సభ్యుడు సత్తిబాబు, బంగారయ్య, జగన్నాథము భీమరాజు, కృష్ణమూర్తి, వెంకటరమణ, బెన్నా స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పార్టీ మండల కార్యదర్శిగా కిల్లో మోస్య ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-అనంతగిరి: శనివారం అనంతగిరి మండల కేంద్రంలో జీ.దేవాన్న దేముడుమ్మ అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో జిల్లా కార్యదర్శి కామ్రేడ్ అప్పలనర్స ఆధ్వర్యంలో 11 మందితో ఎన్నిక జరిగింది కార్యదర్శి గా కిల్లో మోస్య సభ్యులు గా సోమెల నాగులు జి దేవన్న దీసారి దేముదుమ్మ సీవేరి కొండలరావు వెంకటరమణ బుద్రయ్య ఎన్ గంగులు ఎం.క్రీష్ణ కాసులమ్మ తదితరులు ఎన్నికయ్యారు.

గ్రంధాలయ ఉద్యమకారులకు ఘన నివాళి

విశాలాంధ్ర-గంగవరం : గ్రంథాలయాల అభివృద్ధి కోసం గ్రంథాలయ ఉద్యమ పితామహుడు స్వర్గీయ అయ్యంకి వెంకట రామణయ్య కృషి చేసారని గ్రంథాలయాధి కారిని గంగాభవాని అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమకారుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం బాలురు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంను ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలంలో చలివేంద్రి సచివాలయంను ఆకస్మికంగా సందర్శించిన ఎంపీడీవో బి.వెంకటరమణ సిబ్బంది పని వేళలను పాటించకపోవడం, ప్రభుత్వం నిర్దేశించిన పనులను చేయడంలో అలసత్వం వహించిన సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగింది.

ప్రజాప్రతినిధులకు, ఎంపీటీసీలకు ఒక్కరోజు శిక్షణ

విశాలాంధ్ర-పాచిపెంట : గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందడానికి నూతన వరవడిని తీసుకురావడానికి డిప్యూటీ సీఎం మరియు పంచాయతీరాజ్ శాఖ మాత్యులు కే పవన్ కళ్యాణ్ గ్యాప్ పంచాయితీ సర్పంచ్లు కు ఎంపీటీసీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమము ఏర్పాటు చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం సమావేశపు భవనములో శనివారం మండలంలో గల గ్రామస్థాయి అధికారులకు వివిధ శాఖలకు చెందిన అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ బి.ప్రమీల జ్యోతిని వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఆమె అన్నారు. అలాగే ఎంపీడీవో జనార్ధనపాత్రో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ మాత్యులు డిప్యూటీ సీఎం నూతనంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి చెందుటకు, నూతన ప్రణాళికలు తయారుచేసి రాష్ట్రమంతటా ఒకే విధంగా గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందడానికి డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీచేశారని ఆయన అన్నారు. ఆ మేరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎంపిటిసి సభ్యులు డి.ఏడుకొండలు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామ పంచాయతీలు సర్పంచులకు మండల ప్రాదేశిక మెంబర్లకు, ప్రత్యేక గౌరవాన్ని ఇస్తూ వారి గౌరవ వేతనాన్ని పెంపుదల చేస్తామని అనే వార్తలు సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయని అన్నారు. సర్పంచులకు ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు పెంపుదల అమలు చేసినట్లయితే అభినందనీయమని అన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే పంచాయతీల పట్టుకమ్మనలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రవీంద్ర, నారాయణలు స్థానిక ఎంపీటీసీ సభ్యులు డి ఏడుకొండలు కోటికి పెంట సర్పంచ్ అప్పలనాయుడు సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-జిమాడుగుల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి ఆదేశాల మేరకు శనివారం ప్రత్యేకంగా జి.మాడుగుల ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నటువంటి ఎంపీ ఎలిమెంటరీ స్కూల్ అన్నింటిలో పిల్లల ఆరోగ్యం విషయంలో అన్ని తనిఖీలుచేసి వారికి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జి మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వారు డాక్టర్ ఏ రవిచంద్రశేఖర్ మరియు ఎన్ ప్రకాష్ ఆరోగ్య విస్తరణాధికారి వైద్య సిబ్బంది పాల్గొనడం జరిగినది.

ఈనెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంను నవంబరు 19న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈమేరకు సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా నవంబరు 19నుండి డిసెంబర్ 10వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలో పెద్దఎత్తున చేపట్టుటకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, గ్రామీణ నీటి సరఫరా అధికారి సమన్వయంతో పనిచేయాలని ఆయన చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద దీనిని చేపట్టడం జరుగుతోందని ఆయన తెలిపారు. బహిరంగ మలవిసర్జన సామాజిక దురాచారమని ఆయన పేర్కొన్నారు. మరుగుదొడ్ల వినియోగం ఆత్మ గౌరవం పెంపొందిస్తుందని ఆయన పేర్కొంటూ ప్రజలు అందరికి అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. మహిళలు, బాలికలు బయటకు వెళ్లడం భద్రత రీత్యా కూడా మంచిది కాదని ఆయన చెప్పారు. నవంబరు 19 నుండి డిసెంబరు 5వ తేది వరకు నిర్వహించే కార్యక్రమాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు పత్రాలు జారీ, మరుగుదొడ్లను అందంగా తీర్చిద్దడం తదితర కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని ఆయన చెప్పారు. డిసెంబరు 6వ తేది నుండి 9వ తేదీ వరకు మరుగుదొడ్ల వినియోగం పై ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన తదితర అంశాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. బాగా ఉపయోగిస్తున్నవారికి ప్రోత్సాహకాలు అందించడం, వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం, ప్రశంసించడం తదితర అంశాలను చేపట్టాలని ఆయన సూచించారు. ఈసమావేశంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి ఓ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు, అనర్ధాలు, వాటి నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగి పుట్ మండల పరిధిలో గల మార్ముల పంచాయితీలలో పలు గ్రామాలలో గత మూడు రోజుల నుండి గంజాయి సాగు, వాటి నిర్మూలపై, దానిపై జరిగే అనర్ధాలపై కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఎస్సై జె.రామకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వారి ఆదేశాల మేరకు మండలం నందు గల మారుమూల గ్రామాలైన రంగబయలు పంచాయితీ పనస, కిరంభో మాకవరం పంచాయితీ బలడ, రంగబయలు పంచాయితీ చుట్టుగొంది చంపాపుట్టు, కోసోంపుట్టు రంగినిగూడా గ్రామాలలో జన జాతర కళా మండలి వారిచే పాటల ద్వారప్రజలకు, బుర్రకథల రూపంలో గంజాయి సాగు చేయుట, రవాణా చేయుట వలన ఎంతోమంది జైలు పాలు అవుతున్నారు. కొంత మంది చదువుకోవాల్సిన పిల్లలు మత్తుకు బానిస గా మారి చదువుకు దూరమై వివిధ కేసులలో ఎరుక్కొని కుటుంబాలకు దూరమవుతున్నారు. ఈ విదంగా కేసులలో ఇరుక్కున్న యువత ఉద్యోగ అవకాశలు కోల్పోవటమే కాకుండా కేసులలో ఇరుక్కొని ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలు పేదరికబారిన పడుతున్నాయి. కావున ప్రజలు ఈ గంజాయి పంట సాగును విడిచిపెట్టి ప్రభుత్వ సహకారంతో ప్రభుత్వం అందించే జామ, సిల్వర్, కాఫీ, కొబ్బరి మొదలగు పంటలను సాగు చేస్తూ ఆర్థికంగా స్థిరపడగలరని ప్రజలని చైతన్యపరిచే విదంగా జన జాతర కళా మండలి వారిచే అవగాహన కార్యక్రమాలు నిర్వహింమని అయన తెలిపారు.

పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయండి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : ప్రతి పంచాయతీ అభివృద్ధి విషయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై అభివృద్ధి ప్రణాళిక ను సిద్ధం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్. రమేష్ పంచాయతీ సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు అధికారులను కోరారు. శనివారం ఆయన ఎంపీడీవో కార్యాలయం సమావేశం మందిరంలో మరియు వెలుగు కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన గ్రామపంచాయతీ, బ్లాక్ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2025-26 సంవత్సరానికి గాను పై టీఓటిలతో శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం యొక్క నిధులు 2025‑ 26 సంవత్సరానికి గాను ప్రణాళిక ఏవిధంగా తయారు చేయాలనే విషయంపై ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా తొమ్మిది అంశాలను అనగా పేదరికం లేని విస్తృతమైన జీవనోపాదులు కలిగిన గ్రామం, ఆరోగ్యవంతమైన, స్నేహపూరితమైన పిల్లల కలిగిన, స్నేహపూర్వకమైన మహిళలను కలిగిన, నీటి సమృద్ధి కలిగిన స్వయం సమృద్ధి వస్తులతో కూడిన, మంచి పరిపాలన కలిగిన, సామాజిక న్యాయం, సామాజిక భద్రతా కలిగిన గ్రామాలుగా తయారు చేయడం పై దృష్టి సారించాలని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన పనులను గుర్తించి డిసెంబరు లోగా అందజేస్తే ఫిబ్రవరి 2025లోగా నిధులు మంజూరు చేయించుకోవచ్చని చెప్పారు. దీనిపై ఆయా శాఖల అధికారులు సర్పంచులు కార్యదర్శులు ఎంపీటీసీ సభ్యులు దృష్టి పెట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ గుడివాడ సంపత్ కుమార్ సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు, వివోఏలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా ధనుంజయ్

ముచ్చటగా మూడోసారి ఏకగ్రీవ ఎన్నిక... అభినందించిన పార్టీ నాయకులు, అభిమానులు

విశాలాంధ్ర-చింతపల్లి : సిపిఎం పార్టీ మండల కార్యదర్శిగా పాంగి ధనుంజయ్ ముచ్చటగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గడచిన రెండు పర్యాయాలు ప్రజా సమస్యలపై ఆయన పోరాడిన తీరును చూసిన పార్టీ శ్రేణులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు మండల కమిటీ సభ్యులుగా సాగిన చిరంజీవి, మర్రి నాగేంద్ర, సుందర్ రావ్, ఎన్ కనకవల్లి లను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

సమయపాల పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి : సర్పంచ్

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : సమయపాల పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కితలంగి సర్పంచ్ సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ పంచాయితీ పరిధిలోనున్న పలు ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ఆయన చెప్పారు. పాఠశాల సమయం ఉదయం 9:30 నుండి సాయంత్రం మూడున్నర వరకు పాఠశాల నిర్వహణ సాధించాల్సిన ఉపాధ్యాయులు భోజనానంతరం ఏదో సాకులు చెప్పుకుంటూ వెను తిరుగుతున్నారని ఆయన ఆరోపించారు. ఏ ఒక్క ఉపాధ్యాయుడు కూడా సక్రమంగా సమయపాలన పాటించడం లేదని సర్పంచ్ చెప్పారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి ప్రత్యేక దృష్టి సారించి అటువంటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్కు, ఐటిడిఏ పిఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కొర్ర.గాసి ఆ పంచాయతీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజల గొంతుక 'పాత్రికేయ వ్యవస్థ'

గిరి జనజాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకటరమణ

విశాలాంధ్ర-చింతపల్లి: సామాన్య ప్రజల గొంతుకగా పని చేస్తున్న మీడియా లేకపోతే ప్రజల కష్టాలు పాలకులకు తెలియవని సమస్యల వెలికి తీతలో, వాటి పరిష్కారంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల కంటే మీడియా మిత్రుల పాత్ర అమోఘమని గిరిజన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు ముర్ల వెంకటరమణ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఆయన మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనే గాక, మన్యంలో డోలీ మోతల సంగతి ప్రభుత్వం వరకు చేరిందంటే అది కేవలం మీడియా కృషి ఫలితమే అన్నారు. మన్య ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు సైతం కనీస మౌలిక వసతులైన రహదారులు, త్రాగు, సాగునీరు, విద్యా, వైద్యం, విద్యుత్ వంటివి ఏర్పడ్డాయి అంటే పాత్రికేయుల పుణ్యమే అన్నారు. రైతుల, ఉద్యోగుల కష్టాలు ప్రభుత్వం వరకు చేరుతున్నాయంటే అది కేవలం మీడియా పుణ్యమేనని, చట్ట సభల్లో గెలిచిన నాయకులు సమస్యల గురించి మాట్లాడక పోయినా, ప్రజల గొంతుకై పాలకుల వరకు చేరే విదంగా నినదించడంలో మీడియా పాత్ర ఎప్పటికి మెచ్చుకోదగ్గదే అన్నారు. ఏరంగంలో అభివృద్ధి జరిగినా ఆ అభివృద్ధిలో మీడియా పాత్ర తిరుగులేనిదన్నారు. మీడియా అంటే సమాజంలో ఒక గుర్తింపు ఉందంటే వేతనాలు లేకపోయినా అహర్నిశలు ప్రజా సమస్యలపై పాత్రికేయులు పనిచేస్తుండడమే అన్నారు. ఎవరైనా, ఎంతటి వారైనా మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందే అన్నారు. సమాజంలో మీడియాకు అంతటి గౌరవం ఉందన్నారు. ప్రధాని సభ అయినా, ముఖ్యమంత్రి సభ అయినా, కలెక్టర్ సభ అయినా పాత్రికేయులకు ముందువరుసలో ప్రత్యేక స్థానం ఉంటుందని, అదే మీడియా ప్రత్యేకత అని ఆయన కితాబిచ్చారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పాత్రికేయులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

జంఝావతి, తోటపల్లి సమస్యలు పరిష్కరించండి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జంఝావతి, తోటపల్లి ప్రాజెక్టులు పూర్తికి సహకరించాలని, పార్వతీపురం నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని ప్రధానమైన మూడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకతను ఎమ్మెల్యే విజయ్ చంద్ర శాసనసభలో ప్రస్తావించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఎంతో సుందరంగా కొండ కోనలతో కనిపించే పార్వతీపురం అభివృద్ధి చెందిందని అంతా భావిస్తారని అక్కడ పరిస్థితి చూస్తే అభివృద్ధి అంతంత మాత్రమేనని తెలుస్తుందన్నారు. ప్రధానంగా విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే మార్గంలో హెవీ వెహికల్స్ వందలాదిగా తిరుగుతున్నాయి. పట్టణ మధ్యలో నుంచి వెళ్లడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నయని సమావేశంలో ప్రస్తావించారు. ప్రమాద నివారణకు బైపాస్ రోడ్ అవసరం ఉందని అలాగే జంఝావతి ప్రాజెక్టు నాలుగు దశాబ్దాలకు పైగా పెండింగ్లో ఉందని ఎమ్మెల్యే వివరించారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకుంటే వేలాది ఎకరాలు సస్యశ్యామలవుతాయన్నారు. అలాగే తోటపల్లి ప్రాజెక్టు విస్తరణ తదితర అంశాలను ఎమ్మెల్యే ప్రస్తావించారు.

ముగిసిన జిపిడిపి శిక్షణ కార్యక్రమాలు

విశాలాంధ్ర-సీతానగరం : గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం జిపిడిపి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ బలగ రమణమ్మ, జడ్పిటిసి మామిడి బాబ్జిలు తెలిపారు. గత మూడు రోజులుగా మండలంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగుసాయి. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ జడ్పిటిసిలు మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాల వలన అన్ని అంశాలు సర్పంచులకు ఎంపిటిసి లకు తెలిసిందన్నారు. గ్రామపంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పన కోసం వీటిని సద్వినియోగం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో పాండ్రంకి త్రివిక్రమరావు ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశం వివరించారు. ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించడానికి ఈరోజు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మూడు రోజులపాటు మండలంలోని అన్ని శాఖల అధికారులకు ప్రజాప్రతినిధులకు గ్రామైఖ్య సంఘ సభ్యులకు శిక్షణలు జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ పెంట సత్యంనాయుడు, రిసోర్స్ పర్సన్లు శశిభూషణరావు, మనోహర్, శ్రీనివాసరావు, పీటర్‌పాల్, 35 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు సెక్రెటరీలు పాల్గొన్నారు.